క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డితో డాక్టర్ గణేష్ భేటీ

నియోజకవర్గ స్థితిగతులపై చర్చ



రేపల్లె రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని రేపల్లె నియోజక వర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి రేపల్లె నియోజకవర్గ స్థితిగతులపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు, నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలపై సుబ్బారెడ్డితో చర్చించినట్లు గణేష్ తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక దృష్టి కనబరుస్తున్నట్లు పేర్కొన్నారు.

బాపట్ల పట్టణంలో ఫాగింగ్‌కు చర్యలు

బాపట్ల: బాపట్ల పట్టణంలో ప్రత్యేక ఫాగింగ్‌కు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. రోడ్లతో పాటు డ్రైనేజీల్లో కూడా ఫాగింగ్ చేయటం వలన దోమల నివారణకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు చెత్త చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. ఫాగింగ్ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ కరుణ, సిబ్బంది ఉన్నారు.

తెల్లరేషన్ కార్డులు కలిగిన కార్మికులకు బీమా

అమర్తలూరు(వేమూరు): తెల్ల రేషన్ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులు, మత్స్య కార్మికులు, అంగన్‌వాడీ, ఆయాలు, వలస కార్మికులు, చేపల చెరువుల కాపలా దారులు, ఇటుక బట్టీల కార్మికులు, రాతి పని కార్మికులు, ఉపాధి కూలీలు, రిక్షా కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు గ్రామ సచివాలయం వద్ద బీమా చేయించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మారుతీ శేషమాంబ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీమా చేయించుకున్న కార్మికులకు పూర్తి వైకల్యం ఏర్పడితే రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యం ఏర్పడితే రూ.1 లక్ష అందుతాయని, అందువల్ల నమోదు చేసుకున్న తర్వాత నెంబరు వస్తుందని, దానిని భద్రపరచవలసిందిగా ఆమె కోరారు.

ఒలంపియాడ్‌లో బాపట్ల విద్యార్థిని ప్రతిభ



బాపట్ల: బాపట్లకు చెందిన నిహారిక ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరిచిందని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరఘురాం తెలిపారు. భారత వాతావరణ శాఖ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఒలంపియాడ్‌లో బాపట్ల పబ్లిక్ స్కూల్ నుంచి పాల్గొన్న 9వ తరగతి చదువుతున్న నిహారిక స్టేట్ సెకండ్ వచ్చిన సందర్భంగా ఢిల్లీలో భారత వాతావరణ శాఖ డైరెక్టర్ మృత్యుంజయ మహాపాత్ర చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుందన్నారు. బాపట్ల పబ్లిక్ స్కూల్లో నిహారికను శాలువా మెమెంటోతో మంగళవారం బాపట్ల వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు జె.పద్రక్, ఎం.రమేష్ బాబు, బి.ప్రసాద్, జి.గుప్తేష్ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస రఘురాం, ఉపాధ్యాయులు సత్కరించారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

తెనాలిఅర్బన్: చెంచుపేట మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, భోజనం చేసే వారి నుంచి వివరాలు సేకరించారు. సమయానికి వీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

'ప్రియదర్శిని'లో ప్రాజెక్టు ఫెస్ట్-2025

తెనాలిఅర్బన్: శాస్త్ర, సాంకేతిక, సామాజిక రంగాల్లో వస్తున్న విప్లవత్మాక మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల కమిటీ అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టు ఫెస్ట్-2025 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో కంప్యూటర్ హెచ్ఓడీ వేదాంతం శ్రీ సుధా, అధ్యాపకులు దాసరి సాంబశివరావు, షేక్ ఆరిఫా, తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్లు.. నో పార్కింగ్..!?

- సెల్లార్లలో యథేచ్ఛగా వ్యాపారాలు
- గత్యంతరం లేక రహదారులపైనే పార్కింగ్
- వైద్యశాలలు, కల్యాణ మండపాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఇదే తంతు
- పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని అధికారులు



సెల్లార్‌లో నిర్వహిస్తున్న వ్యాపారాలు

రేపల్లె రూరల్: వాహనాల పార్కింగ్‌ల కోసం నిర్మించిన సెల్లార్లు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపార కేంద్రాలుగా మారాయి. పట్టణంలోని పలు కాంప్లెక్స్‌ల్లో నిర్మించిన సెల్లార్లు వ్యాపార కేంద్రాలుగా కొనసాగుతుండటంతో వాహనాల పార్కింగ్‌కు సమస్యలు ఎదురవుతున్నాయి. కాంప్లెక్స్‌ల యజమానులు రాబడే ధ్యేయంగా సెల్లార్లను వ్యాపార సంస్థలకు అద్దెకు ఇస్తున్నారు. దీంతో సెల్లార్లు.. నో పార్కింగ్ ప్రదేశాలుగా మారిపోతున్నాయి. నిబంధనల ప్రకారం బహుళ అంతస్తుల నిర్మాణాలలో పార్కింగ్‌కు స్థలం కేటాయించాల్సి ఉంది. భవన నిర్మాణ ప్లానింగ్‌లో పార్కింగ్‌కు స్థలం కేటాయించి నిర్మాణాలు చేపట్టినా తరువాత నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సంస్థలకు అద్దెకు ఇస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి పదుల సంఖ్యలో ఉన్న బహుళ అంతస్తుల భవనాల్లోని సెల్లార్లు వ్యాపార కేంద్రాలుగా మారాయి. అయా భవంతుల యజమానులు మున్సిపల్ శాఖ అధికారులకు ముడుపులు చెల్లించి మేనేజ్ చేస్తున్నట్లు పట్టణంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా బహుళ అంతస్తుల భవనాల పార్కింగ్ ప్రదేశాల్లో కొనసాగుతున్న వ్యాపార సంస్థల వైపు మున్సిపల్ అధికారులు కన్నెత్తైనా చూడటం లేదు.

వ్యాపారాలతో ఇబ్బందులు

పలు కాంప్లెక్స్‌ల్లోని సెల్లార్లలో యాజమానులు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అద్దెలకు ఇవ్వటంతో వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలాలు లేక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలోని సెంట్రల్ పార్కింగ్‌లోనే వాహనాలు నిలుపుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పలు కాంప్లెక్స్‌ల్లో ఇదే తంతు ఉండటంతో సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాల సంఖ్య ఎక్కువై కనీసం రోడ్డును దాటేందుకు కష్టపడాల్సిన పరిస్థితి. నెహ్రూ బొమ్మ సెంటర్ మొదలు రింగు రోడ్డు వరకు సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలు నిత్యం కిక్కిరిసి ఉంటాయి. అంతర్గత రహదారుల్లోని కాంప్లెక్స్‌ల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో వాహన చోదకులు, పాదాచారుల ఇక్కట్లు వర్ణనాతీతం.

దుకాణాల ఎదుటే వాహనాలు

సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహించటం, ఇటు సెంట్రల్ పార్కింగ్‌లో అధిక సంఖ్యలో వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో కొంత మంది వాహన చోదకులు దుకాణాల ఎదుట నిలుపుదల చేస్తున్నారు. రహదారులలో ఎక్కడబడితే అక్కడ వ్యాపార సంస్థల ముందు వాహనాలు పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యకు దారితీస్తోంది. ఇక అంతర్గత రహదారులలో ఈ సమస్య వర్ణనాతీతంగా ఉంది.

- పట్టణంలోని పలు కల్యాణ మండపాలు నెలకొల్పి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవటంతో వాహనాలు రహదారులపై నిలుపుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఏవైనా ఫంక్షన్‌లు జరిగే సమయంలో ఆ వైపు వెళ్లాలంటే వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- అంతే కాకుండా పలు వైద్యశాలలు ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులలో ఉండటంతో వైద్యశాలలకు వచ్చే వారు వైద్యశాలల ఎదుటే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వైద్యశాలలోకి తీసుకెళ్లాలన్నా ఇబ్బందిగానే ఉంటోంది.
- అదే విధంగా పలు బ్యాంక్‌లకు సైతం పార్కింగ్ ప్రదేశాలు లేకపోవటంతో వాహనాలను బ్యాంక్‌ల ఎదుటే పార్క్ చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సెల్లార్లలో నడుపుతున్న వ్యాపార సంస్థలను తొలగించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.


పార్కింగ్ స్థలం లేని కల్యాణ మండపం


సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలు

నోటీసులు జారీ చేస్తాం



కాంప్లెక్స్‌ల్లో దుకాణాలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలి. సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు. వ్యాపార సంస్థలు, కల్యాణ మండపాలు, వైద్యశాలలు తప్పనిసరిగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలి. పార్కింగ్ లేని సంస్థలకు నోటీసులు జారీ చేయటం జరుగుతుంది.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

సస్యరక్షణపై రైతులు దృష్టి సారించాలి

ఏవో రమేష్‌బాబు

నగరం: మినుము సాగులో సస్యరక్షణ చర్యలపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొలగానివారిపాలెం, పమిడిమర్రు గ్రామాలలో వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మినుము సాగు చేసిన రైతులు తెగుళ్ల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మినుము పంటకు కాండం తెగులు ఆశిస్తుందన్నారు. దీని వల్ల మొక్కలు చనిపోయే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు ఎసిఫేట్ 1 గ్రా లేదా డైమిథోయేట్ 2 మి.లీ మందును తగిన నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

అమర్తలూరు(వేమూరు): మినుము, పెసర పంటల్లో బూడిద తెగులు నివారణకు ఇండేక్స్ ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్కడక్కడ రసం పీల్చు పురుగులు కనిపిస్తున్నాయని, నివారణకు ఎసిఫెటు ఎకరానికి 350 గ్రాములు లేదా ఫ్రైడ్ ఎకరాకు 60-80 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈ కేవైసీ కూడా చేయించుకోవాలని ఆమె చెప్పారు. అపరాలు పంటకు 20 నుంచి 25 రోజుల లోపు కలుపు మందు పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీకాంత్, డి.లక్ష్మీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


బెల్లంవారిపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో రమేష్‌బాబు


ప్యాపర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

వేమూరు: పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతను పెంచడానికి.. వ్యాధులను నియంత్రించడానికి పశు పోషకులకు సేవలు మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఏడీఏ జనార్ధనరావు అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని పెరవలి, క్రాప, ఈపూరులంక, చినపులివర్రు, యడ్లపల్లి, అమర్తలూరు, భట్టిప్రోలు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పెరవల పశు వైద్య శిబిరంలో ఏడీఏ జనార్ధనరావు పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరాల్లో పశువులు, మేకలు, కోళ్లకు వ్యాపించు వ్యాధుల నివారణకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు పశు వైద్య శిబిరాలు అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు పశువులను తీసుకువచ్చి వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయ గ్రామాలకు చెందిన పశు వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.


పెరవలి పశు వైద్య శాలలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

గానాల రామమూర్తి విశ్వబ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు నింపారు

బాపట్ల: విశ్వబ్రాహ్మణులను బీసీల్లో చేర్పించేందుకు కృషి చేసిన రావుబహుద్దూర్ బ్రహ్మశ్రీ గానాల రామమూర్తిని ఎప్పటికీ మరిచిపోకూడదని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. గానాల జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గానాల రామమూర్తి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్సీగా ఉండి పట్టుబట్టి శాసనసభలో విశ్వబ్రాహ్మణులను బీసీలుగా చేర్పించేందుకు విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. విశ్వబ్రాహ్మణులకు పేరుకు ముందు బ్రహ్మశ్రీ అనే పదం వాడే విధంగా పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడలి జగదీష్, జి.ప్రభాకర్ విశ్వకర్మ, మచ్చా సుధాకర్, మాగంటి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పండగ ఆదాయం రూ.7లక్షలు

తెనాలిఅర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా తెనాలి ఆర్టీసీ డిపో నుంచి అదనపు బస్సులు నడపడం వల్ల రూ.7లక్షల ఆదాయం అదనంగా సమకూరిందని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు బస్సులు నడపడం జరిగిందన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, గుంటూరుకు 38 సర్వీసులు నడిపినట్లు చెప్పారు. ఆర్టీసీని ప్రయాణికులు అదరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతి ఒక్కరు దానగుణాన్ని కలిగి ఉండాలి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరు దానగుణాన్ని కలిగి ఉండాలని, సమాజ హిత కార్యక్రమాలలో పాల్గొనాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో పేదలు, యాచకులకు మంగళవారం నిర్వహించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవ కోసం వినియోగించాలన్నారు. కోవిడ్ వంటి విపత్కర సమయంలో ఆదర్శ వేదిక సభ్యులు అందించిన సేవలు ఎనలేనివని, అదే విధంగా ప్రతి సంవత్సరం యాచకులు, పేదలకు సాయం చేయటం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు పండగ దినాలలో మహిళలు, చిన్నారులను ప్రోత్సహించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటంలో పట్టణ ఆదర్శ వేదిక అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని చెప్పారు. పట్టణంలోని దేవాలయాలు, రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రధాన రహదారుల వెంబడి యాచకులు, పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక అధ్యక్షుడు బి.వి.మోహనరావు, కార్యదర్శి యడ్లపల్లి కిషోర్, సభ్యులు కె.ఆనందరావు, ఎస్.సాయికృష్ణమాచార్యులు, ఎ.వెంకటేశ్వరరావు, కె.నటరాజ్, షేక్ బషీర్, కె.సాంబశివరావు, పి.జవహర్, జి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకులు నాంచారయ్య

రేపల్లె రూరల్: పశు యజమానులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాకులు బెల్లంకొండ నాంచారయ్య అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నుపల్లివారిపాలెం, మోళ్ళగుంట గ్రామాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరాలలో బొబ్బర్లంక పశు వైద్యాధికారి మీనాక్షి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందులు, పశువులకు తిరగకట్టే మందులు అందజేసి చూడి పశువులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో చెన్నుపల్లివారిపాలెం సర్పంచ్ ముత్తిరెడ్డి జయరామయ్య, మాజీ సర్పంచ్ దూళిపాళ్ళ పుల్లారావు, పశు వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకులు నాంచారయ్య

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఎస్ఐ తిరుపతిరావు

నిజాంపట్నం: ఈవ్‌టీజింగ్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నం ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం అంధకారం అవుతుందన్నారు. చదువే ధ్యేయంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి సమాజంలో తోటి వారికి తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

చెరుకుపల్లి: కన్జ్యూమర్స్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో స్థానిక కస్తూరివారిపేటలోని రామశాస్త్రి కల్యాణ మండపంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహించబడునని బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గువ్వల ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు, ఫోరమ్ సభ్యులు, ఇతర విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. బాపట్ల, పొన్నూరు, చెరుకుపల్లి సబ్ డివిజన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందించి పరిష్కరించుకోవచ్చన్నారు.

రేపు ఆత్మీయ సమావేశం

రేపల్లె రూరల్: పీడీఎఫ్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఎమ్మెల్సీ కేఎల్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ప్రజా సంఘాలు, గ్రాడ్యుయేట్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీ సుబ్రహ్మణ్యంలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావును కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, కర్షక, ప్రజా సంఘాలు బలపరిచాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై నిత్యం పోరాటాలు చేసే లక్ష్మణరావును బలపరిచేందుకు ఆయా సంఘాల నాయకులు, గ్రాడ్యుయేట్స్ ఆత్మీయ సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

సర్వే వేగవంతం చేయాలి

కర్లపాలెం: ప్రభుత్వ ఆదేశాలతో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం పేరలి గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలోని ప్రతి గృహాన్ని జియో ట్యాగింగ్ చేయాలని ఎన్‌పీసీఎల్ సర్వే త్వరగా చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించటంతో పాటు తమ శాఖలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామంలో జాబ్ కార్డులున్న కుటుంబాలకు తప్పనిసరిగా ఉపాధి హామీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేయించాల్సిన బాధ్యత టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని చెప్పారు.


పేరలి గ్రామంలో సర్వే సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు

ఆన్‌లైన్ క్విజ్‌లో విశ్వశాంతి విద్యార్థి ప్రతిభ

భట్టిప్రోలు (కొల్లూరు) : ఆన్‌లైన్ క్విజ్‌లో విశ్వశాంతి విద్యార్థి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వెంకట్రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీరాలకు చెందిన గీత యంగ్ సైంటిస్టు స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్‌లో జూనియర్స్ విభాగంలో ఎస్‌కే. జాఫర్‌సాధిక్ 10 నిమిషాలలో 50 ప్రశ్నలకు జవాబులు చెప్పడం ద్వారా ద్వితీయ స్థానం సాధించడం జరిగిందన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.2 వేలు నగదు తోపాటు, మెడల్, ధ్రువీకరణ పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ క్విజ్‌లో రాణించిన విద్యార్థిని కరస్పాండెంట్ వెంకట్రావు, హెచ్‌ఎం పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వేమూరు: గుంటూరు ప్రభుత్వం వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోతర్లంక సుబ్రమణ్యం(45) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కోగంటి గోపి ఫెర్టిలైజర్ షాపు దగ్గర పోతర్లంక సుబ్రమణ్యం, అద్దేపల్లి జాన్ వేస్లీ, అదేపల్లి ప్రవచన్, గోనుగుంట్ల డేవిడ్ మధ్య గొడవలు మనస్సులో పెట్టుకొని ఈ నెల 16వ తేదీ రాత్రి ఇటుక రాళ్లతో సుబ్రమణ్యంను తలపైన కొట్టగా బలమైన గాయాలు కావడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ రవికృష్ణ మంగళవారం తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సుభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ తెలియజేశారు.

